క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

కడియం: మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యం సాధించడం ఆత్మరక్షణకు తోడ్పడుతుందని కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ అన్నారు. సీనియర్ మాస్టర్ గంగ్రోతు నాగ ప్రతాప్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. శిక్షణ పొందుతున్నవారికి అవసరమైన పరికరాలను రూ.15 వేలు వెచ్చించి అందజేశారు. వైస్ ఎంపీపీ పంతం గణపతి, వార్డు సభ్యులు కట్టా శివ, సీనియర్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, గంగ్రోతు భాస్కరరావు, మహిళా కోచ్ కావ్య పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి పూజలు


పంచముఖ ఆంజనేయస్వామి అలంకరణలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పంచముఖ ఆంజనేయస్వామి అవతారంలో స్వామివారిని అలంకరించారు. ముందుగా సిందూరం, తమలపాకులతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

సీటీఆర్‌ఐ: లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలోని పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 31వ తేదీన అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగమళ్ల ప్రసాద్ (ఫైల్)

ధవళేశ్వరం: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు నాగమళ్ల ప్రసాద్ (36) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. జలారుపేట కొండ మెరక ప్రాంతానికి చెందిన నాగమళ్ల ప్రసాద్ ఈ నెల 20వ తేదీన భవన నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై పైనుంచి కిందకు పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువత సన్మార్గంలో పయనించాలి

కోరుకొండ: యువత సన్మార్గంలో పయనించేలా పాస్టర్లు కృషి చేయాలని కోరుకొండ ఎస్సై కూన నాగరాజు అన్నారు. జంబూపట్నం కల్వరి మినిస్ట్రీస్‌లో మంగళవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు ఒరిగేటి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎస్సై నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చర్చిల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. తీవ్రవాద చర్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రహదారుణం

- అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారి
- దామిరెడ్డిపల్లి గ్రామస్తుల ఆవేదన
- మోకాలి లోతు గోతులతో సతమతం
- స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్న వైనం

కడియం: గోతులతో అధ్వానంగా మారిన రహదారిపై ప్రయాణానికి ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. దామిరెడ్డిపల్లి మీదుగా వెళ్లే వీరవరం - మాధవరాయుడుపాలెం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. మోకాలి లోతు ఏర్పడిన గోతుల్లో నీరు చేరి, స్విమ్మింగ్ పూల్స్ మాదిరిగా ఏర్పడ్డాయి. దాదాపు కిలోమీటరు మేర రోడ్డు మీద ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నర్సరీ అసోసియేషన్, గ్రామస్తులు ఈ గోతుల్లో గ్రావెల్, ఇటుకలు తదితర వ్యర్థాలు వేసి కొంత వరకు పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే.

ప్రారంభానికి నోచుకోక..

ఈ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టేశాం, ఇక నిర్మాణం అయిపోయినట్టేనంటూ గతంలోనే ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు కూడా రోడ్డును ఏ పక్క నుంచి నిర్మించాలంటూ స్వయంగా పరిశీలించారు. కానీ ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు. గ్రామానికి వచ్చే ప్రతి ప్రజాప్రతినిధులకు, అధికారులకు తమ గోడు వెళ్లబోసుకుంటున్నా ఫలితం ఉండడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..

గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాధవరాయుడుపాలెం, జేగురుపాడు తదితర గ్రామాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కడియపులంక, మడికి మార్కెట్లకు తరలించేందుకు ఈ రోడ్డునే ప్రధానంగా వినియోగిస్తుంటారు. అయితే మోటారు సైకిళ్లు, ఆటోలు తదితర వాహనాలపై కూరగాయలు, పువ్వులను తీసుకువెళ్లంటే కష్టంగా మారిందని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామం చుట్టూతిరిగి దాదాపు మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టి, తమ ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు.


రోడ్డుపై గోతులను తప్పించుకుంటూ డ్రైవింగ్ చేస్తున్న వాహనచోదకుడు


గోతులమయంగా తయారైన రహదారి


గోతులతో అధ్వానంగా మారిన దామిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు

ఎవరికి మొర పెట్టుకున్నా..

గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ రోడ్డును మాత్రం అభివృద్ధి చేయడం లేదు. గోతులతో అధ్వానంగా మారిన రోడ్డుపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల గడుస్తున్నా రోడ్డు నిర్మించకపోవడం దారుణం.

– రాంబాబు, దామిరెడ్డిపల్లి

నిత్యం ప్రమాదాలు

మోటారు సైకిల్‌పై కూరగాయలను తీసుకుని ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. ఎక్కడ పడిపోతామో అర్థం కావడం లేదు. మోకాలి లోతు నీరు, రాళ్లతో నిండిన గోతుల కారణంగా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

– వీరబాబు, కూరగాయల వ్యాపారి

తెలుగు వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభించాలి


విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని, అవసరమైన వైస్ చాన్సలర్, అధికారులు, అధ్యాపకులు, సిబ్బందిని నియమించి కార్యకలాపాలు చేపట్టేలా కూటమి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం కోసం అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. క్యాబినెట్ మీటింగ్‌లో ఆమోదం మాత్రమే తెలిపితే సరిపోదని, తెలుగు విశ్వవిద్యాలయానికి కావాల్సిన అనుమతులు ఇచ్చి, పెద్ద ఎత్తున నిధులను విడుదల చేసినప్పుడే విశ్వవిద్యాలయం అభివృద్ధి చెంది నిలదొక్కుకుంటుందన్నారు.

విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు


తెలుగు పద్యాల పోటీలో పాల్గొన్న విద్యార్థి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం బీవీఎం స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు బొడేం నాగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నీతికథలు చెప్పడం, తెలుగు పద్యాలు (వేమన శతకం, సుమతి శతకం, కృష్ణ శతకం) పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ముందుగా కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు ఉపాధ్యాయుడు శ్రీకాంత్ మాట్లాడుతూ కందుకూరి గొప్ప సంఘ సంస్కర్త అని, నవయుగ వైతాళికుడిగా పేరు పొందారన్నారు. వివేక వర్ధిని పత్రికను స్థాపించి విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి ఆశయ సాధనకు కృషి

- మంత్రి దుర్గేష్
- నవయుగ వైతాళికునికి నివాళి

సీటీఆర్‌ఐ: నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం ఆశయాల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వీరేశలింగం వర్ధంతి సందర్భంగా హితకారిణి సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి స్థానిక ఆనంద గార్డెన్స్‌లోని కందుకూరు దంపతుల సమాధులకు పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలపై వీరేశలింగ పోరాటం చేసి, ప్రజలను చైతన్యవంతులు చేశారన్నారు. మహిళలు చదువుకుంటే సమాజంలోని పరిస్థితులు బాగుపడతాయని నమ్మి మహిళల కోసం చదువు కోసం విద్యాలయాలను స్థాపించారన్నారు. హితకారిణి సమాజం అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వినోద్ కుమార్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, డాక్టర్ బీవీ రమణమూర్తి పాల్గొన్నారు


కందుకూరి సమాధికి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

- స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం వర్ధంతి నిర్వహించారు. కందుకూరి విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి నివాళులర్పించారు.
- కందుకూరి వీరేశలింగం పంతులు అభ్యుదయ భావాలు, ఆశయాలను ముందుకు తీసుకువెళతామని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న కందుకూరి వీరేశలింగం పంతులు విగ్రహానికి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని, ఉపాధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు పాల్గొన్నారు.
- కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని డీసీసీబీ మాజీ చైర్మన్, టౌన్ హాల్ కార్యదర్శి ఆకుల వీర్రాజు కొనియాడారు. కందుకూరి నిర్మించిన పుర మందిరం (టౌన్ హాల్)లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ హాల్ లైబ్రేరియన్ సుబ్బారావు, తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, ట్రెజరర్ కె.సత్యనారాయణ, టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలో..


కోటిపల్లి బస్టాండ్‌లోని వీరేశలింగం విగ్రహానికి నివాళి


టౌన్‌హాల్‌లో కందుకూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు తదితరులు

ప్రతి ఒక్కరికీ యోగా అత్యవసరం

రాజమహేంద్రవరం రూరల్: నేటి ఉరుకులు, పరుగుల జీవనంలో ప్రతి వ్యక్తికి యోగా అత్యవసరమని ఇన్‌చార్జి ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం ఆయన ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన నేటి ప్రపంచంలో యోగా సాధనతో ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి ఆకెళ్ల ప్రసాద్, ఎంఈవో తులసీదాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లూరి హోమియో వైద్య కళాశాలలో..

కంబాలచెరువు: డాక్టర్ అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో యోగాంధ్ర యోగ అభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పర్యవేక్షణలో యోగాంధ్ర షెడ్యూల్ రూపొందించినట్లు జిల్లా ఆయుష్ వైద్యులు డాక్టర్ కె.రమేష్, సమన్వయ కర్త పి.కాజియా తెలిపారు. 25 రోజుల పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి ఓంకార్, యోగా గురువు ఏ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


హుకుంపేటలో యోగాసనాలు వేస్తున్న అధికారులు


అల్లు రామలింగయ్య హోమియో కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం

యోగాంధ్రలో ప్రజలను భాగస్వాములు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు అయ్యేలా చూడాలని సచివాలయ కార్యదర్శులకు అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సచివాలయాల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలపై సచివాలయాల కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటింటికి వెళ్లి యోగా ప్రాముఖ్యతను తెలిపి, ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. సుముఖంగా ఉన్న వారి వివరాలను యోగాంధ్ర యాప్‌లో నమోదు చేయించాలన్నారు. యోగా గురువులు, యోగా శిక్షకులు, అభ్యాసకులు ఇలా కేటగిరీల వారీగా వివరాలు సేకరించిన అనంతరం యోగాభ్యాస కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సచివాలయాల స్థాయిలో పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. ఎంపికైన వారిని జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పంపిస్తామన్నారు. ప్రతి ఒక్క సెక్రటరీ యోగాంధ్ర 2025 థీమ్‌తో ప్రజలను సన్నద్ధం చేయాలని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెక్రటరీ జి.శైలజావల్లి, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, సీఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

సీతానగరం: మునికూడలికి చెందిన బాలికపై అత్యాచారయత్నం చేసిన బోడి వెంకట ప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 11 ఏళ్ల బాలిక ఈ నెల 25వ తేదీన తన పిన్నికి కూర ఇచ్చేందుకు వెళ్లింది. ఆ ఇంటికి తాళం వేసి ఉండడంతో పక్క ఇంటిలో ఉంటున్న వెంకట ప్రసాద్‌ను ఆ తాళం తీయాలని కోరింది. అయితే ప్రసాద్ తాళం తీసిన తర్వాత బాలికను ఇంటిలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేయబోయాడు. దీంతో బాలిక గట్టిగా కేకలు వేస్తూ పరుగున ఇంటి నుంచి బయటకు వచ్చింది. దీనిపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్టీ ఎస్సీ కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు వెంకట ప్రసాద్‌ను ఇంటి దగ్గరలో నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ అరెస్ట్ చేశారు. రాజమహేంద్రవరం 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా వెంకట ప్రసాద్‌కు రిమాండ్ విధించారన్నారు.

టెర్రస్ గార్డెనింగ్‌తో ఎంతో ప్రయోజనం


టెర్రస్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగర వాతావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు టెర్రస్ గార్డెనింగ్ ఎంతో దోహదపడుతుందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ భవనంపై మంగళవారం అధికారులతో కలిసి ఆయన మొక్కలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ఇటీవల కాలంలో టెర్రస్ గార్డెనింగ్ విపరీతంగా పెరిగిందన్నారు. చాలామంది ప్రజలు తమ భవనాలపై కూరగాయలు, ఆకు కూరలు, పండ్లను సేంద్రీయ పద్ధతుల్లో, సహజ సిద్ధంగా పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. దీనివల్ల పర్యావరణ వ్యవస్థ మెరుగుపడుతుందని, కాలుష్య సంబంధిత సమస్యలు రావన్నారు. ప్రతి ఒక్కరూ తమ మేడపైన ఖాళీ ఉంచకుండా, వారికి తోచిన సమయంలో టెర్రస్ గార్డెనింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఈఈ మాధవి, ఏడీహెచ్ కె.స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచి, ఆర్గానిక్ ప్రాడక్టుల ద్వారా రైతులు నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని ఏపీఈడీఏ, అగ్రికల్చర్ ప్రాసెసింగ్ ఫుడ్ ప్రాడక్ట్స్, ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ బి.అశోక్ కుమార్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంగళవారం ఉద్యానవన, ఏపీఎంఐపీల ఆధ్వర్యంలో ఎఫ్‌పీవోలు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ అగ్రికల్చర్, హార్టికల్చర్ ఉత్పత్తులను ఎగుమతులు చేసేటప్పుడు ఎదుర్కొనే సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన విధి విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆహార ఉత్పత్తుల్లో అధిక దిగుబడులు సాధించడానికి రసాయన (కెమికల్స్) పదార్థాలు అధికంగా వాడకం వల్ల నాణ్యత ప్రమాణాల పరీక్షలు చేపట్టే సందర్భంలో పలు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వాటిని అధిగమించడానికి ప్రకృతి వ్యవసాయ సాగు (ఆర్గానిక్ ప్రాడక్ట్స్) ఉత్పత్తుల ద్వారా మంచి నాణ్యమైన పంటలు అందించవచ్చన్నారు. ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)ని ఏపీఈడీఏలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఇతర దేశాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఎగుమతులపై అవగాహన

జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.సుజాత కుమారి మాట్లాడుతూ ఉద్యాన రైతులందరూ పంటల ఎగుమతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రసాయనాల వాడకం వల్ల ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం తగ్గిపోవడమే కాకుండా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ రైతులందరూ ఎఫ్‌పీవో ద్వారా ప్రభుత్వ సబ్సిడీలను ఉపయోగించుకుని క్వాలిటీ ప్రాడక్టులు అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ ఎ.దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యానవన పంటల ద్వారా వచ్చే ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయన్నారు. సమావేశంలో ఆర్గానిక్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, ఎఫ్‌పీవోలు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	శుభం
సూర్యమినీ :	ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్ :	మిషన్ ఇంపాజిబుల్
స్వామి :	ఏస్
శివజ్యోతి :	హిట్-3
అనుశ్రీ :	ఫైనల్ డెస్టినేషన్
రాజా :	ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి :	నిశ్శబ్ద ప్రేమ
రంభ :	ఒక బృందావనం
మేనక :	వైభవం, ఎలెవన్
అప్సర :	సింగిల్
కుమారి :	వర్షం
అశోక :	కేసరి చాప్టర్-2
నామవరం	
వీఎస్ మహల్ :	ఏస్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఏస్, సింగిల్
కడియం	
వెంకటసూర్య :	ఫైనల్ డెస్టినేషన్

సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎగ్జిబిటర్ల బంద్ చేయనున్నారనే సమాచారంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు సినిమా థియేటర్లలో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని సాయి కృష్ణ (అనుశ్రీ సినిమాస్), రంభ, ఊర్వశి, మేనక, సూర్య ప్యాలెస్, సూర్య మినీ థియేటర్లలో ఆర్‌డీఓ ఆర్.కృష్ణనాయక్, డీఎస్పీ భవ్య కిషోర్, డీపీఆర్‌ఓ వై.బాలకృష్ణ, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్కయ్య, అర్బన్ తహసీల్దార్ పీహెచ్ పాపారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.అన్నవరం తదితరులతో కలసి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, థియేటర్ల లైసెన్స్, ఫైర్ లైసెన్స్, స్మోక్ డిటెక్షన్, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, టికెట్లు, పానీయాల ధరలు, తాగు నీటి సదుపాయాలను పరిశీలించామని తెలిపారు. అగ్నిమాపక యంత్రాలు, బేస్‌మెంట్ వైశాల్యానికి అనుగుణంగా ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్, మాన్యువల్‌గా పని చేసే ఎలక్ట్రిక్ ఫైర్ అలారం సిస్టమ్, టెర్రస్ లెవెల్ వాటర్ స్టోరేజీ ట్యాంక్ సామర్థ్యం, టెర్రస్ స్థాయిలో నీరు తోడే ఎలక్ట్రికల్ పంపు సామర్థ్యం వంటి అంశాలపై తనిఖీలు చేపట్టామని వివరించారు. పానీయాలు, టికెట్లను నిర్దేశిత ధరలకు మించి అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. ఓ థియేటర్ కాంప్లెక్స్‌లో మహిళల మరుగుదొడ్లలో ఏమాత్రం వెలుతురు లేదని, కనీసం లైట్లు కూడా ఏర్పాటు చెయ్యలేదని, గుహలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోపాలున్న థియేటర్ల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయనున్నామని తెలిపారు. ఆహార, పానీయాల ధరలపై నియంత్రణ ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే టికెట్ల ధర పెంపునకు అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇదే తరహాలో థియేటర్లలో తనిఖీలు కొనసాగుతాయని జేసీ తెలిపారు.


థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న జేసీ చిన్నరాముడు, ఆర్‌డీఓ కృష్ణనాయక్ తదితరులు

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

కోరుకొండ: బాల్య వివాహాలు సమాజ వికాసానికి విఘాతం కలిగిస్తాయని, వాటిని అరికట్టడానికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి క్రాంతిలాల్ అన్నారు. కోరుకొండ సచివాలయం -2లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు ప్రజలకు అవగాహన లేక బాల్యవివాహాలను నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో నిరంతర ప్రయత్నం ద్వారా వీటిని అరికట్టగలమన్నారు. సమావేశంలో జిల్లా కో ఆర్డినేటర్ బి.రాజకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీ, లక్ష్మి పాల్గొన్నారు.